# ఆ గూటి చిలుక

ఆ వీధి మలుపు దగ్గర ఏదో పాట వినిపిస్తూంది.

ఆ పాట పాడుతున్న మనిషి గొప్ప గాయకుడేమీ కాదు. పాడుకుంటూ వీధివీధి తిరిగి భిక్షం అడుక్కునే వాడు. ఆపాటలో సాహిత్యపు విలువలు శూన్యం, కానీ అతను పాడే తీరు బాగుంది. చిత్రంగా ఉంది. ఒక క్షణం మన దృష్టిని తన వేపు తిప్పుకునేలా చేస్తుంది.

ఆ గొంతులో అదోవిధమైన జీర ఉంది.

అయినా, గమ్మత్తుగానే ఉంది.

* * *

అందంగా, ఎత్తున ఉన్న ఆమేడింట్లో-

తలంతా తియ్యగా, దిమ్మెత్తించే అగరొత్తుల కమ్మని వాసనలతో, ప్రశాంతమయిన పూజా మందిరంలో పూజచేస్తూ కూర్చుంది లలితమ్మ. ఆవిడ పొద్దున్నే లేచి తల స్నానం చేసినట్టుగా ఉంది. జుట్టు ముడి వేసుకుని, తువ్వాలు తలకి చుట్టుకుంది. భక్తితో కళ్ళు మూసుకుని దేవీ స్తోత్రం చదువుతూంది.

* * *

ఆ ముష్టివాడు ఒక ఇంటి ముందు నుంచుని, ఇంటివాళ్ళు లేదని కసిరి కొడితే కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి మరో గుమ్మం ముందు ఆగేడు.

అతని చేతిలోని బిల్లకర్ర జమికిలి మీద ఆధే పనిగా కదులుతూ అతని పాటకి పిచ్చి సంగీతాన్ని అందిస్తూంది. అతని బట్టలు మాసిపోయి, జిడ్డు కంపు కొడుతున్నాయి. అతని చంకలో వేలాడుతున్న సంచి కడుపులో బల్లతో వికారంగా పడి ఉండే కుర్రాడిలా- అసహ్యంగా ఉంది. అందులో నుంచి లొత్తలుపడిన సిల్వరు కంచం ఆశగా బయటికి చూస్తూంది. అతని జుత్తు కొబ్బరి పీచులా ఉంది. కళ్ళు పీక్కుపోయి ఉన్నాయి. గుబురుగా పెరిగిన అతని గడ్డం చీదరగా ఉంది.

అతని పాట వినొచ్చును, కాని పెదవుల్ని చూడకూడదు. బూజుపట్టిన జాడీ అంచుల్లా అసహ్యంగా ఉన్నాయవి.

* * *

కొత్త మేక్సీ వేసుకుని, డ్రసింగ్ టేబిలు ముందు వచ్చిన తన అందాన్ని తనే చూసుకుంటూ మురిసిపోతోంది కోమలి. అద్దంలో ఆమెకి తనరూపం ఎంతో ఆకర్షణతో మోహనంగా ఉన్నట్లు తోచి, గర్వం అనిపించింది. కాంతులీనుతున్న చెక్కిళ్ళను మునివేళ్ళతో సుతారంగా రాసుకుని, తృప్తిగా

నవ్వుతుంది. నవ్వినప్పుడామె చిన్న పెదవులు గుండ్రంగా ముడుచుకున్నాయి ఆమె విశాలమైన కళ్ళు గర్వంతో మెరిసిపోతున్నాయి. ఇంటిమేట్ సెంటువాసన మత్తుగా హాయిగా ఉంది. అరచేత్తో మెత్తటి సున్నితమయిన జుత్తుని సవరించుకుంటూ 'హాయ్' అనుకుంది తనలో తనే.

ఉడుకులోన్ తీయని స్పర పరవశం కలిగిస్తూంది కోమలికి.

ఇవాళ ఈ కొత్త మేక్సీతో, ఈ అందంతో, స్టేజిఎక్కి మాట్లాడితే. హాలు హాలంతా చప్పట్లతో దద్దరిల్లి పోవలసిందే! ప్రైజు తనకి కాకుండా మరెవరికి పోతుంది.

దొంగ చూపుల కెమిస్ట్రీ లెక్చరర్ జడ్జీగా ఉంటే చిక్కేలేదు.

* * *

''దుక్కలా ఉన్నావు. పని చేసుకోలేవు!''

ఇచ్చుట సలహాలు ఉచితం. పసేది? ఎవరిస్తారు? ఈ తిట్లూ శాపనార్థాలూ అలవాటే తనకి. అసలు వాటితోటే సగం ఆకలి చచ్చిపోతుంది.

ఆకలి! ఆకలి!

ఆకలి గుర్తొచ్చిందా ముష్టివాడికి. కడుపులో ఎముకలు కరకరలాడినై. రాత్రి ఒక్క పిడచ దొరకలేదు. రాత్రంతా ఒకటే వర్షం, కడుపులో కాళ్ళు పెట్టుకుని సత్రం అరుగు మీద చలికి వణికిపోతూ పడుకున్నాడు.

ఉదయం లేచి టీ చుక్కయినా పడలేదు కడుపులో. ఆకలితో కడుపు దహించుకుపోతూంది. వేగిరం నాలుగిళ్ళు తిరిగి ఇంత ఉడకేసుక తినకపోతె కళ్ళు తిరిగి పడిపోతాడేమో కూడా!

అంత నీరసమున్నా, అలవాటుగా అతని స్వరం మామూలు స్థాయిలోనే ఉంది. తగ్గలేదు. పాట ఆగలేదు. జమికిలి చప్పుడవుతూనే ఉంది.

* * *

ఫ్రిజ్‌డేర్‌లో నుంచి రెండు నిమ్మకాయలు తీసి. వాటిని నాలుగు ముక్కలుగా కోసి టిఫిన్ ప్లేటులో పెట్టుకున్నాడు మోహన్.

పెసరట్లు వాసన ఘాటుగా ఉంది. బాగా వేగిన ఉల్లిపాయ ముక్కల రుచి వర్ణనాతీతం. పెసరట్లు ఉప్మా మంచి కాంబినేషను.

కాంబినేషనంటే గుర్తొచ్చింది. తనకి నిమ్మీ మంచి కాంబినేషనుకాదూ! 'ఈడూ జోడూ బావుందని కాబో[illegible] [illegible]. ఓహ్! ఈ అందమయిన ఉదయం పూట నిర్మలని గుర్తుకు తెచ్చుకోవటం ఎంత మధురంగా ఉందో! అసలు నిర్మల గురించిన ఆలోచనల్లోనే ఎంతో తియ్యదనం ఉంది.

ఆ చేపల్లాంటి కళ్ళు నావి.

ఆ నునుపైన మెరిసే బుగ్గలు నావి.

వెర్రెక్కించే ఆ వంటి వంపులన్నీ నావి. నావే.

నిర్మల తనది. తనకి [illegible] [illegible]దవాలి.

కాని.. నిర్మల తనకి దక్కాలంటే ముందు చాలా తతంగం ఉంది. తను బాగా చదవాలి. ఎక్స్‌లెంట్ మార్కులు రావాలి. యూనివర్సిటీలో అంతా తనని గురించే గొప్పగా చెప్పుకోవాలి. అలా జరగాలంటే తను కష్టపడి చదవాలి. చదువు.. చదువు. చదువంటే తనకీ ఇష్టమే. ఇంతవరకూ అన్ని క్లాసుల్లోనూ తను ఫస్టు మార్కులతోనే వస్తున్నాడు.

నిర్మలకీ చదువంటే ఇష్టం.

తెలివితేటలున్న అబ్బాయి అంటే ఇష్టం.

అందం, పర్సనాలిటీ ఉన్న వాళ్ళంటే ఇష్టం.

తనకి అందం, చదువు, పర్సనాలిటీ అన్నీ ఉన్నాయి. అందుకే నిమ్మీ తనంటే ప్రాణం పెడుతుంది.

ఒక చల్లని సాయంత్రం వేళ బీచ్‌లో ఎగిసిపడే కడలి తరంగాలనే చూస్తూ ''యూ మస్ట్ సెక్యూర్ యూనివర్సిటీ ఫస్ట్, మోహన్'' అంది.

''సర్టన్లీ'' అన్నాడు తను ఎంతో నమ్మకంగా.

''గుడ్, నీ మీద నాకా ఫెయిత్ ఉంది''.

''థాంక్స్. థాంక్యూ నిమ్మీ!''.

''దెన్.. దెన్ వోన్లీ ఐ లైక్యూ మోహన్!''

శంతనుడికి గంగాదేవి విధించిన షరతులా. కానీ ఇదేమీ తనకి బాధాకరమయింది కాదు.

''ఓ.కే'' న్నాడు నవ్వుతూ.

దూరంగా-

సముద్రం నీట్లోకి జలక్రీడ కోసం దిగిన మదించిన ఏనుగులా ఉంది, యారాడకొండ. అది తొండం ఎత్తి నీటిని ధారగా చిమ్ముతున్నట్టు లైటుహవుస్ కాంతి తళుక్కున మెరుస్తోంది.

చుట్టు పక్కల ఎవరో పిల్లలు ఆడుకుంటున్నారు.

పల్లీల కుర్రవాడు తమ వేపే వస్తున్నాడు.

వెధవ. మంచీ మర్యాదా తెలీదు. ఒక అబ్బాయి, అమ్మాయి పొందిగ్గా మాట్లాడుకుంటూన్న వేళ అటువేపు రాకూడదన్న ఇంగితం లేని బడుద్దాయి. అందుకే పల్లీ లమ్ముకుంటూ బతుకుతున్నాడు.

వాడు రాకుండానే...

చప్పున నిర్మల చెయ్యి అందుకుని ముద్దు పెట్టుకుంటూ ''యూ ప్రెటీ నిర్మలా! ఐ లవ్ యూ'' అనేశాడు.

సున్నితంగా అతని చేతిని విడిపించుకుంటూ కిలకిలా నవ్వింది నిర్మల. ఆమె అందమయిన నవ్వు లాంటి తెల్లని సముద్రపు నురగ చల్లగా వచ్చి వాళ్ళ పాదాల్ని తాకి చక్కిలిగింతలు పెట్టింది.

''పరీక్షలు దగ్గిర కొస్తున్నాయి. ఇక లేదామా?'' అంటూ లేచింది నిర్మల. తనూ లేచాడు.

అవును.

పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఇవి తన చదువుకీ, జీవితానికీ కూడా పరీక్షలే. అయితే అందుకే శ్రద్ధగా చదవాలి. పూరీకే చదువుతూ కూచుంటే ఒళ్ళు వేడి చేస్తుంది. నిమ్మకాయలు చలవ. బాగా వాడమని ఫ్రెండొకడు సలహా ఇచ్చాడు.

నిమ్మరసం ఉప్మాలో పిండుకుని తినడానికి ఉపక్రమించాడు మోహన్.

* * *

పాట ఆపి, జోలె లోకి చూసుకున్నాడు ముష్టివాడు. నిండా నాలుగు పిడికిళ్ళు లేవు. 'లోకంలో ధర్మం నశించి పోతోంది' అనిపించింది వాడికి. ఆకలి వెర్రికేకలు వేస్తోంది. ఆకలంటూ వెయ్యకుండా ఉంటే దానికేదయినా మందుంటే బాగుణ్ణు కానీ మందులు చాలా ఖరీదు ఆ ఖరీదయిన మందులు కొనలేకనే కదా అయ్యా, అమ్మా దిక్కు మాలిన చావులు చచ్చారు? ఆకల్ని చంపే మందున్నా అదికొనడానికి డబ్బుండద్దూ. డబ్బు కావాలంటే మళ్ళీ తన లాంటి వాడు ఇలా ఇల్లిల్లూ తిరిగి అడుక్కోక తప్పదు కాబోలు.

పాట మళ్ళీ ఎత్తుకున్నాడు. అదే స్థాయిలో పాడుతున్నాడు. మళ్ళీ అదే పాట. బిల్ల కర్ర తన పని మామూలుగా చేసుకుని పోతూంది.

* * *

చిలకాకు పచ్చరంగు పాలిస్టర్ ఫ్రాక్ వేసుకుని, ముద్దుగా హాలు ముందు వసారాలో తండ్రి కుర్చీ పక్కన కూర్చుని ఉంది పప్పీ. ఆ పాప చేతిలో నాలుగు చాక్లెట్లూ, రెండు లడ్డూలూ ఉన్నాయి.

''పొద్దున్నే స్వీట్ తినకూడదమ్మా!'' కూతుర్ని మందలించింది లలితమ్మ.

పప్పీ మారాం చేసింది.

ముద్దుగా గారాలు పోయింది.

లలితమ్మకి ఇవ్వక తప్పలేదు. ''కొంచెం కొంచెం తిను ఎవరికీ పెట్టకేం'' అంది. స్వీట్స్ అందుకుని సంబరంగా వీధి వసారాలోకి పరుగు తీసింది పప్పీ. వీధిలో పోయే రిక్షాలనీ, మనుషుల్ని చూస్తూ మధ్య మధ్య స్వీట్ చిన్న చిన్న ముక్కలు కొరుకుతూ కూర్చుంది.

మమ్మీ మంచిది. ముందు లేదన్నా, తరవాత అన్నీ ఇస్తుంది.

* * *

''నీ అద్దాల మేడన్నావా? గంగరాజు -

ఏడంతస్థుల మేడన్నావా?

కాలికింద గచ్చున్నావా? గంగరాజు

ముత్తే - బొచ న్నావా!

తల ఎంత్రకి లాడన్నావా? గంగరాజు

పత్తకాయ రేకన్నావా!

తాటి బొరికి బిందన్నావా? గంగరాజు

రంతరెమ్మ చెంబన్నావా!..."

అర్థంపర్థం లేని ఆ పాటని పాడుకుంటూ ఆ ముష్టివాడు ఆ ఇంటి గేటువతల దీనంగా నిలుచున్నాడు.

* * *

వసారాలో వాలు కుర్చీలో కూచుని పేపరు తిరగేస్తున్నారు సుదర్శనంగారు. పెద్ద ఉద్యోగం, హోదా, బాంక్ ఎకవుంటూ, సుఖ జీవితం ఆయన ప్రశాంతంగా కూచోడంతోనే పోల్చుకోవచ్చును.

ప్రక్కనే టీపాయ్ మీద టేప్‌రికార్డరు- ఇండియాది కాదెంత మాత్రం కాదు - ఉంది. టేప్ చేసిన లలిత గీతాలేవో వినిపిస్తూంది.

పూజ గదిలో నుంచి భార్య లలితమ్మ చదువుతున్న దేవీ స్తోత్రం సన్నగా వినిపిస్తూంది.

మధ్యగదిలో కోమలి రికార్డు ప్లేయర్ ఆన్ చేసినట్టుంది. ఏవో హిందీ సినిమాలోని పాటలు వినిపిస్తున్నాయి. సుదర్శనం గారికి నవ్వొచ్చింది.

కోమలికి హిందీ పాటలంటే ఇష్టం. ఆర్డీబర్మన్ సంగీతమంటే ప్రాణం. ఉషా వూతప్ అంటే పిచ్చి. పాప్ మ్యూజిక్ వినడమంటే సరేసరి! పరవశంతో తిండి కూడా మరిచిపోతుంది.

లలిత సంగతది వేరు. ఆవిడకి వంటే పరమ చిరాకు. దేవీస్తోత్రం పేరెత్తితే చాలు భక్తితో ఆవిడ కళ్ళు అరమోడ్పులవుతాయి. పూర్వం పేటినీ పట్టించుకునేది కాదు కానీ, ఇటీవల త్యాగరాజు కీర్తనలు, జయదేవుని అష్టపదులూ అంటే ఆసక్తి చూపిస్తుంది. ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి గాత్రం అంటే చెవి కోసుకుంటుంది. లలితకీ సంగీతం మీద ఆసక్తి ఎప్పటి నుంచి? మిసెస్ కృష్ణస్వామితో పరిచయం ఏర్పడింది లగాయతూ కాబోలు, ఆవిడ శాస్త్రీయ సంగీతం గురించి మాట్లాడేస్తూ ఉంటే తనకి అవమానంగా తోచిందేమో! ఈ సంగతి ఆమెతో అనకూడదు. అంటే కోపంతో ఎగిరి పడుతుంది.

మోహన్‌కి కనీసం నాటకాల పిచ్చీ, సినిమాల పిచ్చీ కూడా లేదు. ఎప్పుడూ తన చదువేమిటో తనేమిటో, అంతే! వాడికని ప్రత్యేకించిన గదిలో తలుపులు బిగించుకుని చదువుతూ కూచుంటాడెప్పుడూ. ఏం చదువుతాడు చెప్మా? సెక్స్ పుస్తకాలు కాదు కదా! ఛఛ.. వాడలాంటివాడు కాదు. అమ్మాయిలంటేనే అమడ దూరం జరిగిపోయే రకం. వాడికి చదువు మీద శ్రద్ధ. లేకపోతే ప్రతియేడు ఫస్టున ఎలా వస్తుంటాడు?

తృప్తిగా పేపరు మడిచి పక్కనే టీపాయ్ మీద పెట్టారు సుదర్శనంగారు. పప్పీ స్వీట్స్ తింటూ బొమ్మలు తెచ్చుకుని ప్రక్కనే ఆడుకుంటూంది.

చుట్ట వెలిగించుకున్నారాయన. తనకి నిజానికి సినిమా పాటలంటేనే ఇష్టం. వాటిలో ఉండే ఆ వేగం, వూపు రెండర్థాల మాటలూ మనసును గిలిగింతలు పెట్టే ఆ సంగీతం తన కిష్టం. కానీ- ఈ సంగతి

బయటపెట్టుకోడానికి తన పరువూ, హోదా అడ్డొస్తాయి. ఆ వయసులో అలాంటి సిల్లీ ఆలోచనలేమిటి? అంతా నవ్వరూ?

క్లబ్బులో-

డాక్టర్ రావ్ మాటల్లో, అతనికి జానపద సంగీతమన్నా, గీతాలన్నా ఎంతో ఇష్టమన్న సంగతి వ్యక్తం చేస్తుంటాడు. ఆ పాటలంటే ఆయన చెవికోసుకుంటారు. ఆ పాటల్లో సజీవత్వం, నేటివిటీ, ఆడంబరాలు లేని సహజత్వం ఏవో తొక్కా, తోట కూరా ఉంటాయట. ఏమిటో అంతా సొది. తనకే అర్థంకాదు. వాటిలో అంత గొప్పేమిటో తన తలకెక్కదు. అంతా రావ్ మాటలు విని అతని టేస్టుని మెచ్చుకుంటూ పొగిడేవారే! అప్పటి నుంచీ తనకి కూడా లలిత సంగీతం అన్నా, జానపద గీతాలన్నా అభిరుచి పెంచుకోవాలనిపించింది. ఆనిర్ణయాని కొచ్చేడు.

ఇది నటన కాదూ?

కావచ్చు! కాని తనిప్పుడున్న పొజిషన్‌లో ఆపాటి హిపోక్రసీ ఎంతయినా అవసరం. కేవలం అలంకారప్రాయంగా ఇంట్లో లైబ్రరీని పేర్చి మెయింటన్‌చేసే వాళ్ళెందరు లేరు? ఇదీ అలాంటిదే! అని తనని తను సమర్థించుకుంటూ ఉంటారాయన.

* * *

పాడుతున్న పాట ఆపి, ''బాబూ.. ధర్మం' అడిగేడు ఆ ముష్టివాడు. కళ్ళద్దాలు సవరించుకుని వాడివేపు చూశారు సుదర్శనంగారు.

వెధవ. ఎంత వికారంగా ఉండాలో అంత వికారంగానూ ఉన్నాడు. మెడలో ఆ డోలూ, చేతిలో కర్రానూ! వెధవ. పని చేసుకుని బ్రతక్కూడదూ? లేజీ ఫెలోస్. తిని అడ్డంగా పెరగడం తప్ప పని చెయ్యడానికి కిష్టపడరు.

''వెళ్ళు..వెళ్ళు..'' అని కసిరేరు. అంతలోనే ఏం ఆలోచన వచ్చిందో ''ఇదిగో మాట, ఇలారా' అని పిలిచేరు.

వాడి రూపం వికారంగా ఉన్నా, పాట బాగానే ఉంది. గమ్మత్తుగా పాడుతున్నాడు. పాటకి తోడు ఆ వాయిద్యంకూడా తమాషాగా ఉంది. వాడి పాటను టేప్‌రికార్డరులో రికార్డు చేస్తేనో, ఆ ఆలోచన అతనికెంతో నచ్చింది. వాడి పాటని రికార్డు చేసి డాక్టర్ రావు దగ్గిరికి ఆ 'కేసెట్' ని తీసుకెళ్ళి వాళ్ళ టేప్ రికార్డర్‌లో ఆ పాట వినిపిస్తే ఆయనెంత సంతోషిస్తాడో? తన టాలెంటునీ టేస్టునీ ఎంత పొగుడుతాడో. నాయంత్రం తన గురించి క్లబ్బులో డీయస్పీ గారి దగ్గిరా, సీ.టీ. వోగారి దగ్గరా చెప్పి మెచ్చుకుంటాడు. వెరీ గుడ్.. వెరీ గుడ్.

వాడు రాలేదు. ఆయన పిలిచింది తననో, కాదో వాడి కవగతం కాలేదు. తననెందుకు పిలుస్తారు? గేటు దాటి లోపలికి వెళ్ళడమా, మానడమా అని వాడు నిర్ణయించుకోలేక సతమతమయి పోతున్నాడు.

''ఫర్లేదు రా''.

సంశయిస్తూనే వాడు లోపలికి అడుగు పెట్టాడు.

''అలా కూచో''.

తటపటాయిస్తూ నేల మీద ఒక వారగా కూచున్నాడు ఆ ముష్టివాడు. చంకలోని మురికి సంచీ అద్దంలా మెరుస్తున్న ఆ గచ్చు మీద పెట్టాలో కూడదో తేల్చులేక ఒళ్ళోనే ఉంచుకున్నాడు.

''ఏ కులమోయ్ నీది?'' అడిగారు సుదర్శనంగారు.

''మందలోళ్ళం బాబయ్యా''.

''బాగుంది. చేతిలో అవేమిటి?''

ఆ బాబు తన గురించీ, తన వస్తువుల గురించీ ఆసక్తి కనపరిచి ప్రశ్నలు వెయ్యడం వాడి కెంతో గర్వంగా ఉంది. గబగబా అడక్కుండానే అన్నీ చెప్పేశాడు.

''అయ్యా. దీన్ని జమికిలంటారండి. దీని తోలుంది సూసేరా? దీన్ని కప్పు సెర్మంతో సేత్తారయ్యా. కప్పు సెర్మమయితే సక్కగా వాగుద్ది బాబు. మరి దీన్నండీ దీన్ని బిల్ల కర్రంటా రండి. దీనితో జమికిలి మీద దెబ్బ లేస్తూ పాడతామన్న మాటండి''.

''ఆ పాట రాసింది నువ్వేనా?''

వాడు తెల్లబోయి చూశాడు. పాట కూరుస్తారు కానీ ఎవురయినా రాస్తారేటి. ఏం చెప్పాలో తోచలేదు.

''మా అయ్య నేర్పిండు బాబూ. ఆడు కిందటికే యెగళ్ళకి పోనాడండి''.

''సరి. సరి. ఏది ఇందాక పాడుతున్నావే. ఆ పాట పూర్తిగా మళ్ళీ పాడతావా? నీకు డబ్బులిస్తాన్లే''.

వాడి కళ్ళ ఆశతో మెరిశాయి. తననీ, తన పాటనీ చూస్తూనే చీదరించుకునే వాళ్ళుంటారనుకున్నాడే తప్ప 'ఇలా ఇష్టంగా తనచేత స్వయంగా పాడించుకుని డబ్బులిస్తానన్న వాళ్ళుంటారని వాడు వూహించనైనా లేదు. వాడిమనసు ఆనందంతో నిండిపోయింది.

హుషారుగా గొంతు సవరించుకుని పెద్ద గొంతుకతో పాట ప్రారంభించాడు.

వాడి గొంతు వినిపించి లలితమ్మ వీధిలోకి వచ్చింది. అక్కడ దృశ్యం చూసి ఆవిడ ఆశ్చర్యపోయింది. ఎవడో ముష్టివెధవ ఏదో వాయిస్తూ అసహ్యంగా పెద్దగొంతుగతో పాడ్డం. భర్త ఆ పాట ఆసక్తిగా వింటూ, టేప్ రికార్డరు ఆన్‌చేసి వాడి వేపే చూస్తూ కూచోవడం!

''బాగుందండీ గొడవ అయిదు పైసలో, పది పైసలో వేసి వాడ్ని వాడి మానాన పొమ్మనక యీ భాగోతం అంతా ఏమిటి? విడ్డూరం కాకపోతే'' అంది. ఆవిడకీ లోకంలో త్యాగరాజులూ, ముత్తుస్వామి దీక్షితులూ లాంటి వాళ్ళు తప్ప, ఇలాంటి వాళ్ళుండడం నచ్చదు.

''ష్... నీకు తెలీదు. నువ్వూరుకో'' అని ఆవిడ్ని వారించేరు సుదర్శనంగారు.

కోమలి వీధిలోకి వోసారి గదిలోంచి తొంగిచూసి, ఆ ముష్టివాడ్నీ, వాడి ఆకారాన్నీ చూసి చీదరించుకుంది. ''ఆ పూర్ క్రీచర్ని గేటు దాటి లోపలికి రానివ్వడమేమిటి? అంతే కాకుండా వాడి ఏబ్రాసి

ముఖానికి ఆ పాటొకటి. మళ్ళీ గంగిరెద్దులా డప్పూ వాయిస్తూనూ! వాడి దిక్కుమాలిన పాటని డాడీ టేప్ చెయ్యడం ఒకటా! ఛ..ఛ' అనుకుని ఇంట్లోకి పోయి, స్టీరియో సౌండ్ హెచ్చించింది.

''కోమలీ ప్లీజు ఆ సౌండ్ తగ్గించమ్మా, కనీసం ఈ పాట రికార్డు చేసేవరకయినా'' బ్రతిమాలుతున్న ధోరణిలో తండ్రి మాటలు వినిపించి, గత్యంతరంలేక ఆఫ్ చేసింది. ఆమెకి తండ్రి తీరు అసహనంగా ఉంది. ఏదో సినిమా పత్రిక తీసుకుని ఫోం బెడ్ మీదికి వాలిపోయింది.

దీక్షగా చదువుకుంటున మోహన్ యీ తతంగం గమనించి విసుగ్గా 'హు! డాడీ కీ మధ్య పిచ్చెక్కింది'' అనుకున్నాడు. అతను గది తలుపులు తీసుకుని మాత్రం బయటకి రాలేదు!

స్వీట్ చిన్న ముక్కలు కొరుకుతూ తమాషాగా ఆ ముష్టివాడినీ, వాడు వాయించే తీరునీ గమనిస్తూ కూచుంది పప్పీ.

సుదర్శనంగారు టేపుని రీవైండ్ చేసి, వాడిని మళ్లీ పాట మొదలు పెట్టమని చెప్పి, 'రికార్డ్' ఆన్ చేశారు.

పాట రికార్డు చెయ్యడం పూర్తయింది. సుదర్శనంగారికెంతో తృప్తిగా ఉంది. ఈ పాటను రికార్డు చేసినందుకు డాక్టర్ రావ్ తననెంత అభినందిస్తాడో!

సంతోషంగా కుర్చీలోంచి లేచి, గదిలోకి వెళ్ళి డాక్టర్ రావ్‌కి ఫోన్ చేశారు. డాక్టరుగారు ఇంట్లోనే ఉన్నారు. ''మీరు కాసేపు ఇంట్లోనే ఉండండి. పనుంది వస్తాను'' అని చెప్పి, డ్రస్ మార్చుకుని హడావిడిగా వీధిలోకి వచ్చారు సుదర్శనంగారు. ఇందాక టేప్ చేసిన కేసెట్ అతని జేబులో బరువుగా ఉంది. దాన్ని తృప్తిగా తడుముకున్నారు.

'బాబూ..'' ఆదరాబాదరగా వీధిలోకి పోతున్న సుదర్శనంగారిని పిలిచేడు ఆ ముష్టివాడు.

సుదర్శనం ఒక క్షణం ఆగి ''అరె! నువ్విక్కడే ఉన్నావు కదూ'' అనుకుని జేబులు తడిమాడు. నోట్లున్నాయి. చిల్లర లేదు.

''ఉండవోయ్ అమ్మగారేమయినా ఇస్తార్లే'' అని ''లలితా! వీడికేమయినా ఇచ్చి పంపెయ్'' అని కేకేసి, ఆయన వెళ్ళిపోయారు.

ఆ ముష్టివాడిలో ఇంతసేపూ సంతోషంతోనూ, సంభ్రమంతోనూ అణగారిపోయిన ఆకలి మళ్ళీ విజృంభించింది.

ఆశగా ఇంట్లోకి తొంగి చూశాడు.

అమ్మగారు బయటికొచ్చే సూచనలు కనిపించడం లేదు.

వాడి కడుపు ఆకలితో నకనకలాడిపోతోంది.

తనిప్పుడు గేటు లోపల ఉన్నాడు. అసలిక్కడ నించోడమే తప్పు. ఇక ఇక్కడ నుంచి పిలుస్తే అమ్మగారికి కోపం రాదూ! పిలవకపోతే.. తనీ గడపలో ఎంతసేపని ఇలా పడిగాపులు పడుతూ నించోడం ?

తనింక అక్కడుండాలో వెళ్ళిపోవాలో వాడు నిర్ణయించుకోలేకపోతున్నాడు.

ఆకలితో పేగులు మెలితిరిగిపోతున్నట్టున్నాయి. ఎప్పుడైపోతుందో..

జోలెలో బియ్యం ఎటుకీ చాలనంత ఉన్నాయి-

తనకసలు ఇవాళ తిండి తినే ప్రాప్తం ఉందో లేదో ?

మాసిపోయి గుబురుగా పెరిగిన గడ్డాన్ని విసుగ్గా దువ్వుకుంటూ మరోసారి లోపలికి తొంగి చూసేడు ముందు గదిలోంచి అమ్మగారు రావడం కనిపించింది. వాడికి ప్రాణం లేచొచ్చినట్టయింది.

ఆశగా అటుచూసేడు.

అట్నుంచి అటే, మళ్ళీ వంటగదివేపు వెళ్ళిపోయేరు. వెళ్తూ-

''అమ్మాయ్ కోమలీ వాడింకా అక్కడే పడిగాపులు పడుతున్నాడు. ఏదో ఇచ్చి పంపించెయ్యమ్మా చెయ్యి ఖాళీ లేదు'' అనేసి వంట గదిలోకి వెళ్ళిపోయారు.

నిస్సత్తువగా నిట్టూర్పు విడిచాడు ముష్టివాడు.

వాడికి క్షణాలు యుగాల్లా గడుస్తున్నట్టున్నాయి.

ఎవరూ ఇంట్లోంచి వస్తున్న అలికిడి లేదు.

భారంగా పావుగంట గడిచినా, ఎవరూ రాలేదు. నిరాశతో నీరసం కమ్ముకొస్తూంది వాడికి.

కోమలి పాప్ మ్యూజిక్ వింటూ సినిమా పత్రికలో అందాల తారలు కట్టిన చీరలు అందాలనీ, వాటి డిజైన్లు చూస్తూ మైమరచి పోతోంది. ఆ పిల్ల ఈ లోకంలో లేదు.

మోహన్ పుస్తకాల్లో తల దూర్చి, ఉష్ట్రపక్షిలా తదేక దీక్షగా పరిసరాలు మరిచిపోయి చదివేస్తున్నాడు. మధ్య కొంచెం రిలీఫ్ కోసం కళ్ళు మూసుకున్నప్పుడు మాత్రం అతనికి నిర్మల రూపం కనిపిస్తోంది. నవ్వుతూ, ''ఐ లవ్ యూ మోహన్ బట్ యూ మస్ట్ స్టడీ వెల్'' అన్నట్టుగా అనిపిస్తూంది.

ఇక అక్కడ నించునే వోపిక నశించింది ముష్టివాడికి. ఆకలివాడి నరనరమూ పట్టి కదిపేస్తూంది.

వాడికి స్వీట్ కొసరి కొసరి తింటున్న పప్పీ కనిపించింది. వాడిలో ఆకలి పెను తుఫానులా విజృంభించింది.

''పాపా.. ఆకల్తో సత్తన్నానమ్మా, అదెట్టవా నాకు?'' అన్నాడు చెయ్యి చాచి దేబిరిస్తున్నట్లుగా.

అంతసేపూ వాడి వాలకాన్ని విచిత్రంగా గమనిస్తున్న పప్పీ వాడి మాటలు అనడంతోనే స్వీట్ గుప్పిట్లో గట్టిగా మూసుకుంటూ ''అమ్మో! ఇది బూచికిస్తే మమ్మీ తిడుతుంది'' అంటూ ఇంట్లోకి తుర్రుమంది.

ముష్టివాడి కడుపులో ఆకలి పేగేదో కరేలమంది.

నిస్పృహగా గేటుదాటి వీధిలోకొచ్చి, మళ్ళీ పాట ప్రారంభించాడు.

జమికిలి మీద లయబద్ధంగా విల్లకర్ర నాట్యం చేస్తూనే ఉంది...

(ఆంధ్రప్రభ. సచిత్ర వారపత్రిక. 19.3.80)